RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 283 మంగళవారం 8- 9- 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

### తెలంగాణలో మరోసారి 'సర్' గడువు పొడిగింపు

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్,అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్7 వరకు పొడిగిం చినట్లు తెలిపింది.క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

### న్యాయవృత్తి హక్కుల సాధనకై న్యాయవాద పరిషత్ కృషి

నిజామాబాద్, న్యాయవాది పరిషత్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జిల్లా కోర్టు భవనంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణానంద్ మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తిపరమైన రక్షణకే న్యాయవాది పరిషత్ కృషి చేస్తుందని, చట్ట పరమైన సంస్కరణలకు ఆలోచన సంక్షేమకై దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ న్యాయవాద పరిస్థితి పేర్కొన్నారు, న్యాయవాదుల అభ్యున్నతి కై న్యాయవాదులందరు పరిషత్తో కలిసి రావాలని కోరారు. ,

## అసెంబ్లీలో మంత్రి సీతక్క భావోద్వేగ ప్రసంగం..

### కన్నీళ్లు పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్!



2 లో



### సింగరేణి 128 మంది ఉద్యోగుల భవితవ్యంపై నిర్ణయం.. డిప్యూటీ సీఎం

2 లో

## కమ్యూనిస్టుల పోరాటం...

# కాంగ్రెస్ పరిష్కారం



నేడు రవీంద్రభారతిలో జరిగిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టుల పోరాటాలపై తనకు అభిమానం ఉందని తెలిపారు. రైతు, కూలీల కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని, ఆ సమస్యలకు పరిష్కారం చూపింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇంకా.. దున్నే వాడికి భూమి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని సీఎం పేర్కొన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు.

2 లో

## జన్ ధన్ బ్యాంకు ఖాతాలు.

వెలుగులోకి కొత్త విషయాలు, సమాచారం హక్కు చట్టం ద్వారా.

2 లో

### కేటీఆర్ డైరెక్షన్‌లో కంట్రోల్ తప్పిన సభ్యులు

దళిత వ్యతిరేకతను మూటగట్టుకున్న వైనం..



2 లో

## దద్దరిల్లిన హన్మకొండ.. వేలాది మంది విద్యార్థులతో కవిత భారీ పాదయాత్ర!



సీఎం రేవంత్ రెడ్డి విద్య వ్యవస్థను దెబ్బతీస్తున్నాడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన చేపట్టారు. హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన కవిత అక్కడి నుంచి 3 కి.మీ.ల దూరంలోని హన్మకొండ కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కవిత ఫీజు పోరుయాత్ర ఓరుగల్లు నగరం దద్దరిల్లింది. భారీ ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్న కవిత సహా విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. విద్యార్థులతో కలిసి కవిత కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద నడి ఎండలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంటకు పైగా ఆందోళన చేసిన అనంతరం అధికారులు కవిత సహా విద్యార్థులను కలెక్టరేట్ లోపలికి అనుమతించారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్ నల్లగొండలో

# కరువు ఛాయలు

నల్లగొండ జిల్లా:సెప్టెంబర్ 7: సాధారణంగా వానకాలం సీజన్‌లో ఈ సమయానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా పచ్చని పైర్లతో కళకళలాడాలి.కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఇప్పటికే నాట్లు వేసిన వరి పొలాల్లో నీటి కొరత మొదలైంది.నిన్నటి వరకు పచ్చగా కనిపించిన మడి,ఇవాళ తడారిపోయి కనిపిస్తోంది. ఒక్కో మడి చొప్పున ఎండిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వాన కాలంలో 19.41 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉంది రాష్ట్రంలోనే రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణగా పేరున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాధారణంగా వరి 10 లక్షల నుండి 11 లక్షల ఎకరాలకు పైగా సాగవుతుంది. ఈ సీజన్ లో వర్షాభావ పరిస్థితులతో బోరు బావుల కింద ఏడు లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది.

2 లో



### వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి. మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన.

4 లో

### జోగులాంబ గద్వాల్లో...

# భూ బకాసురుల పంజా

## నకిలీ పట్టాలతో భూమి ఆక్రమణ!

నకిలీ పత్రాలతో రంగంలోకి..

ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు..

ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్..




జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో భూ ఆక్రమణదారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రభుత్వ, వివాదాస్పద స్థలాలను లక్ష్యంగా చేసుకుని కొందరు అక్రమార్కులు నకిలీ పట్టాలు సృష్టిస్తూ దర్జాగా కబ్జాలకు తెరలేపుతున్నారు. గద్వాల పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 458 లోని విలువైన భూమిపై భూబకాసురుల కన్ను పడింది.

2 లో

# ఇస్రో ప్రైవేటీకరణ నిజమేనా?

ఇస్రో ప్రైవేటీకరణ నిజంగా అవుతుందా? ఉద్యోగుల్లో ఇదే ఆందోళన.. ప్రస్తుత పరిణామాలతో ఇస్రోను ప్రైవేట్ పరం చేయబోతున్నారనే ఊహాగానాలతో ఉద్యోగుల్లో ఆందోళనలను రేకెత్తించింది. ఈ ప్రచారానికి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణ తెరదించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రైవేటీకరణపై ఆయన సంచలన ప్రకటన చేశారు. అసలు ఇస్రోను ప్రైవేటీకరించే ప్రతిపాదన లేదని స్పష్టం చేశారు. ఇకపై కూడా ప్రభుత్వ సంస్థగానే ఇస్రో కొనసాగుతుందని ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. దేశ అంతరిక్ష పరిశోధన, అడ్వాన్స్ టెక్నాలజీ, వ్యూహాత్మక మిషన్లలో సంస్థ కీలక పాత్రను యధావిధిగా కొనసాగిస్తుందని అన్నారు. ఉద్యోగులు, తమ కుటుంబాల్లో నెలకొన్న ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఇస్రో భవిష్యత్ పాత్రపై ఉద్యోగ సంఘాల్లో తీవ్రచర్చ మొదలైంది.

ఇస్రో ప్రైవేటీకరణపై బిగ్ ట్విస్ట్..

చైర్మన్ నారాయణన్ సంచలన ప్రకటన

ఉద్యోగుల ఆందోళనపై ఇస్రో చీఫ్ స్పందన

సంస్థ భవిష్యత్తుపై కీలక హామీ




2 లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# పదవులూ ప్రాపకాల వివాదాలేనా...!

ఇటీవలి కాలంలో దేశంలోనూ మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో మార్పులూ చేర్పులూ ఆసక్తినే గాక ఆలోచననూ కలిగిస్తున్నాయి. పాలక పార్టీలలో కొందరు కీలక నాయకులూ మంత్రులూ అటూ ఇటూ మారుతున్నారు. ఫిరాయింపులపై కోర్టులలో కేసులే నడుస్తున్నాయి. తాము అధికారంలో వున్నప్పుడు ఇబ్బడిముబ్బడిగా ఇతరులను చేర్చుకున్నవారే ఇతరులకు నైతిక సూత్రాలు చెబుతున్నారు. బయటి నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తూ ఎప్పటి నుంచో వున్న తమను విస్మరిస్తున్నారని వాపోతున్నారు. అత్యంత విధేయులుగా కుడి భుజాలుగా చలామణి అయినవారే మాజీ బాస్‌లకు షాక్‌లిస్తున్నారు. వారూ అదే స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్వాశ్రమంలో అధికార యంత్రాంగంలో, పోలీసు వ్యవస్థలో వుండి రకరకాల ముద్రలేయించుకున్న వారు తర్వాత అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజల్లోకి వస్తున్నారు. ఇక మీడియా కథనాలూ వ్యాఖ్యానాలూ కూడా వార్త స్వభావం కోల్పోయి అటో ఇటో ప్రచారం ప్రధానమైపోతున్నది. మొత్తంగా పత్రికల ప్రాచుర్యం తగ్గుతున్నదంటుంటే మీడియా కూడా నిర్ణీత, నిర్దేశిత ఎజెండాలతో నడుస్తున్నదని బొద్దింకల తిరుగుబాటుతో సహా అన్ని సందర్భాల్లో రుజువవుతున్నది. స్థూల జాతీయోత్పత్తినీ రేటింగును అంచనా వేసే సమయంలో మరింత వాస్తవికంగా వ్యవహరించాలని గౌతం అదానీ బహిరంగంగా పిలుపునివ్వడం ఇందుకో తాజా ఉదాహరణ మాత్రమే. ఇప్పుడు పార్టీలలో మార్పులు, చేర్పులు, చేరికలూ నిష్క్రమణల వెనక కూడా నిర్దిష్ట ప్రభావాలు వున్నాయని సాధారణ ప్రజానీకం కూడా భావిస్తున్న పరిస్థితి. సరళీకరణ యుగంలో ప్రజాస్వామ్య వ్యవస్థ సారాన్ని దెబ్బతీసి కార్పొరేట్ వాణిజ్య వర్గాల ప్రాబల్యమే రాజ్యమేలుతున్న తీరుకు ఇవన్నీ నిదర్శనాలుగా భావించవలసి వుంటుంది. ఈ మొత్తం పరిణామాలలో కొట్టవచ్చినట్టు కనిపించే అంశమేమంటే నిష్క్రమణలూ చేరికలూ విడిపోవడాలూ కొత్త స్థాపనలూ కలయికలూ అన్నిట్లోనూ సామాజిక ప్రజా ఎజెండాలకన్నా వ్యక్తిగత వ్యవహారాలే ముందుకు రావడం. బిఆర్ఎస్ అధినేతపై కుటుంబంపై తిరుగుబాటు చేసిన కవిత, వైసిపి నుంచి వైదొలగిన విజయసాయి రెడ్డి, రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి తొలగించబడిన కొండా సురేఖ, కొంతమంది మాజీ అధికారులు నిర్ణయాలు ఏం తీసుకున్నా వ్యక్తిగత విషయాలే ప్రధానంగా చెబుతున్నారు. సమాజం, రాజకీయాలు తర్వాత వస్తున్నాయి. రాజకీయ తేడాలు గాక వ్యక్తిగత కోణాలలో వస్తున్నారు గనకే తామెక్కడ ఏ విషయంలో విభేదించామో చెప్పలేకపోతున్నారు. పైగా తాము విశ్వసనీయంగా వున్నా అవతలివారే తమను అవమానించారని లేక తమను కాదని మరెవరినో ఎంచుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే జానపద చిత్రాల్లోలాగా రాజు మంచివారే... సేనాపతి, మంత్రులదే తప్పు అని చెబుతున్నారు. దానికి తగినట్టే ఆయా పార్టీల నాయకులు కూడా విధాన పరంగా ఖండించకుండా వ్యక్తిగత దాడులు లేదా విశ్వాస ఘాతుకత అంటూ తిట్టిపోస్తున్నారు. వ్యక్తిగతంగా వారి పదవులూ కోపతాపాలకు తోడు కుటుంబాల కథలూ వ్యథలూ మరీ ముఖ్యంగా మహిళలను కించపర్చే దుష్ప్రచారాలు వివాదాలుగా వీడియో ఆడియో లీకులతో ఆరోపణలూ అభాండాలే నిండిపోతున్నాయి. ముందే చెప్పిన మీడియా కూడా వారి అనుబంధాలనూ ప్రయోజనాలనుబట్టి అటో ఇటో చిత్రిస్తూ తికమక పరుస్తున్నది. అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు కూడా ఈ అనుబంధాలను బట్టి చూపించడం తప్ప విలువలు, వాస్తవాలను బట్టి జరగడం లేదు. ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయం, ధరల పెరుగుదల, శాంతిభద్రతలు, సామాజిక వివక్ష, దేశ సార్వభౌమత్వం, ప్రపంచశాంతి వంటి ముచ్చట్లే మాయమైపోతున్నాయి. ఏమంటే వీరెవరూ పొరబాటున కూడా వాటి జోలికి పోరు. పైన చెప్పిన చాలా వివాదాలపై మీడియా హడావుడిలో పొరబాటునైనా జాతీయ అంతర్జాతీయ పరిణామాలు ప్రస్తావించడమే జరగదు. పైగా ఇప్పుడు మోడీ యుగంలో తిష్ట వేసుకున్న మతతత్వ, హిందూత్వ రాజకీయ భావజాలాన్నే రకరకాల మెలికలతో వినిపించి వీరతాడు వేసుకోవడానికి పాకులాడుతుంటారు. ఏమంటే తమపై ఒత్తిడి అంత తీవ్రంగా వుందంటారు. అవతలివారిని పోటీగా చూపించి సమర్థించుకుంటారు. అసలు మోడీకి ఎవరు ఎక్కువ దగ్గరనేదానిపైనా ఈ పార్టీల నేతల మధ్య గొప్ప పోటీ నడుస్తుంటుంది. కనుకనే లౌకికతత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం వంటి పదాలు చాలామంది గొంతులో అసలు పలకవు. స్థానిక అధికార పోటీ ప్రయోజనాలే దృష్టిలో వుంచుకుని మోడీ సర్కారు పట్ల ప్రశంసలు లేదా మెతకదనం ప్రదర్శిస్తుంటారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోడీని 'బడే భాయ్' అనడంపై చాలా చర్చ నడిచింది. ఇప్పుడాయన అసదుద్దీన్ అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా మోడీ, అమిత్ షాల లాగే దేశభక్తులని పాత బస్తీ నుంచి ప్రకటించగానే కేంద్ర మంత్రులు దాడి ఎత్తుకున్నారు. మతతత్వ రాజకీయాలు ఏవైనా పొరబాటే. అయితే మతాన్ని, దేశభక్తినీ కలగాపులగం చేయడం కూడా తప్పవుతుంది. కృత్రిమ వివాదాలకే ఇవన్నీ పనికి వస్తాయి. ? కొండా సురేఖది తప్పా, అధిష్టానానికి తప్పా అనేది వారి అంతర్గత అంశం. విజయసాయి రెడ్డి రైటా, సజ్జల రామకృష్ణారెడ్డి రైటా... ఎవరిపైన కేసులు పెట్టారు, ఎవరిపై ఎందుకు పెట్టలేదు అనేది కూడా వారి అంతర్గత వ్యవహారమే. కవితకూ కుటుంబానికి మధ్య జరిగిందేమిటన్నది అసలే ప్రజలకు సంబంధించిన విషయం కాదు. గతంలో పాలించిన కెసిఆర్, జగన్ ప్రభుత్వాల విధానాల మంచి చెడ్డలూ ప్రజలకు జరిగిన లాభనష్టాలు ప్రజాస్వామ్య విధానాలు వాటిలో ఇప్పుడు రావలసిన మార్పులు సమాజానికి సంబంధించినవి. ఇప్పుడు పాలన చేస్తున్న చంద్రబాబు నాయుడు–పవన్ కల్యాణ్, రేవంత్ రెడ్డి– భట్టి విక్రమార్క ప్రభుత్వాలకూ అదే వర్తిస్తుంది. వీరిలో ఎవరు ఎప్పుడు ఎవరికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారు? ఏ పదవులు ప్రసాదించారు? ఏవి నిరాకరించారు? ఎప్పుడు ఏ తగాదాలు వారిని విడదీశాయి? వీటితో జనానికి సంబంధమేమిటి? రాజకీయ విమర్శలు, ఆరోపణల విషయానికి వస్తే వారేం చేశారు? చేస్తున్నారనే దానిపై లేదా కేసులు ఆరోపణలపై న్యాయస్థానాలు నిర్ణయాలు తీసుకోవాలి. వీటిని ఎడతెగని పంచాయితీలుగా మార్చి రోజుల తరబడి మీడియా చర్చలనూ రాజకీయ సంవాదాలను సాగదీసుకోవడం అసలు చర్చను పక్కదోవ పట్టించడానికి కూడా కారణమవుతుంటుంది. ఎందుకంటే వీరిలో చాలామంది అటూ ఇటూ ఎప్పుడైనా కలిసిపోతుంటారు. లక్షల కోట్ల విలువైన సంపదలూ సంస్థలను శాసించే అదానీలు అంబానీల పాత్ర అందరి వెనకా వుంటుంది. అసలు ఈ చర్చలలో చాలా భాగం వ్యాపార లావాదేవీలు, కుంభకోణాలలో మునిగి తేలుతుంటుంది. 'కూరిమి కలదినములలో నేరములెన్నడు కలగనేరవు' అన్నట్టు వారు బాగున్నప్పుడు కప్పిపుచ్చుకుని తర్వాత మొత్తం దాడులు చేసుకుంటే ఎవరికైనా విలువేముంటుంది? ఆయా సర్కార్లలో కీలక అధికారులగా చక్రం తిప్పిన వారు చాలా విషయాలు సోదాహరణంగా సాధికారికంగా సమాచారాలు చెప్పగలరు. కానీ వారు విధానాల రీత్యా ప్రజల పక్షాన నిలవడం కీలకం. ఎందుకంటే ప్రపంచీకరణ యుగంలో కార్పొరేట్ శక్తులే సర్కార్లను ఆడిస్తూ తమ ప్రయోజనాల కోసం కథనాలు నడిపిస్తున్నాయి. భారత కార్పొరేట్ సామ్రాట్ అదానీ గురించి అమెరికా మీడియాలో సాగిన వివాదం కేసులు తర్వాత కోర్టుల సాక్షిగా అంతా సర్దుకోవడం చూశాం, కనక ఇలాంటి సందర్భాలలోనూ విమర్శనాత్మకంగా వుండవలసిందే? పర్యావరణ, ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, ఎస్.సి–ఎస్.టి హక్కుల రక్షణ వంటి విషయాలలో కొంతమంది మాజీ ఉన్నతాధికారులు ప్రశంసనీయమైన భూమిక పోషించడం, పౌర సమాజంలో చొరవ చూపడం అభినందనీయం.

# కమ్యూనిస్టుల పోరాటం కాంగ్రెస్ పరిష్కారం

"పోరాటం కమ్యూనిస్టులది.. పరిష్కారం కాంగ్రెస్ పార్టీది'' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మరోవైపు బీజేపీపై విమర్శలు చేస్తూ.. ప్రజలతో గెలవలేనప్పుడు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించిందని ఆరోపించారు. ఇప్పుడు ఎస్ఐఆర్ ను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మైనార్టీల ఓట్లే కాకుండా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల ఓట్లను కూడా తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓట్ల తొలగింపును అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతిపక్షాలు ఇప్పటివరకు ఈ అంశంపై మాట్లాడటం లేదని అన్నారు. 2029 ఎన్నికల్లో మోదీ ఓటమికి ఇవే తొలి అడుగులు అని సీఎం వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అని ఆలోచించవద్దని.. 2026లోనే ఎవరు గెలవాలి.? ఎవరు ఓడిపోవాలి.? అనే విషయాన్ని బీజేపీ నిర్ణయించే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సంఘం నిర్ణయించాల్సిన అంశాల్లో కూడా జోక్యం చేసుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను తిరగేస్తే ఎర్రజెండా అంటే ప్రజలకు నమ్మకం, పేదలకు భరోసా అని రేవంత్ రెడ్డి అన్నారు. మిగిలిన జెండాలను ప్రజలు పాలకుల జెండాలుగా భావిస్తారని, ఎర్రజెండా కనిపిస్తే మాత్రం భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు ఎన్నికల్లో గెలుస్తారా? ఓడిపోతారా? అనే లెక్కలు వేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు. ప్రజల ఓట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కమ్యూనిస్టులు లేవనెత్తే సమస్యలకు సహేతుకమైన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి అని ప్రస్తావించిన సీఎం.. సమస్యను లేవనెత్తేవారు పాలమూరు వారేనని, పరిష్కారం చేసేవారు కూడా పాలమూరు వారేనని అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి పేరుకు తగిన గౌరవం దక్కేలా ఏదో ఒక ప్రాంతానికి ఆయన పేరు పెట్టే అంశంపై మంత్రివర్గంలో చర్చిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్ నల్లగొండలో కరువు ఛాయలు

గతంలో ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు 8 లక్షల నుండి 8.5లక్షల ఎకరాలకు పైగా ఉండగా.. ఈ సారి అది ఆరు లక్షలకు పడిపోయింది. కానీ సాగు విస్తీర్ణం తగ్గినా రైతులకు మాత్రం కష్టాలు పెరిగాయి. సీజన్ ప్రారంభమై నాలుగు నెలలైనా తీర వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా పొట్ట దశకు చేరుకున్న వరికిఇప్పుడు నీరు అత్యవసరం. ఇదే సమయంలో వర్షం ముఖం చాటేయడం. బోర్లలో నీరు తగ్గిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కరువు ప్రభావానికి అసలు అద్దం పట్టేది భూగర్భజలాల పరిస్థితి. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయి.

# సింగరేణి 128 మంది ఉద్యోగుల భవితవ్యంపై నిర్ణయం.. డిప్యూటీ సీఎం

శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కాలరీస్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న మారుపేర్ల సమస్యపై కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. కమిటీ సమర్పించే సిఫార్సుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమస్య ఇటీవల ఏర్పడింది కాదని, 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత సమస్య అని తెలిపారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉండగా, వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహించే పరిస్థితులు గతంలో ఉన్నాయని వివరించారు. చట్టప్రకారం ఒకరి పేరుతో మరొకరు ఉద్యోగం చేయడం తీవ్రమైన నేరపూరిత అంశమే అయినప్పటికీ.. కార్మికుల పరిస్థితులను అర్థం చేసుకుని గతంలో సింగరేణి యాజమాన్యం మానవీయ కోణంలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించిందని భట్టి పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలతో అప్పట్లో 45 మంది అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# కేటీఆర్ డైరెక్షన్‌లో కంట్రోల్ తప్పిన సభ్యులు

## దళిత వ్యతిరేకతను మూటగట్టుకున్న వైనం..

నిజంగా ఇది కేసీఆర్ కు కష్టకాలమే. ఓటమి ఓవైపు ఇంకా వేధిస్తూనే ఉంది. ఫామ్‌హౌజ్‌లో విశ్రాంతి తీసుకుందామన్నా ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ఇంటా బయటా ఆయనకు మనో వేదననే మిగిల్చుతున్నారు. కేటీఆర్‌కు పగ్గాలప్పగించాడు కేసీఆర్. తండ్రి లేకున్నా.. కేసీఆర్ రాకున్నా కేటీఆర్ అన్ని విధాల ఆలోటు తీర్చుతాడు.. అని జనం అనుకునేలా చేయాలనేది కేసీఆర్ ప్లాన్. అందుకే ఈ ఓటమి కాలాన్ని కేటీఆర్‌కు అప్రెంటీస్ కాలంగా భావించాడాయన. ఎలాగూ కాబోయే సీఎం.. అప్పుడు మిస్ అయ్యింది. ఇప్పుడు నిత్యం ప్రజల మధ్య ఉంచడం మూలంగా.. జనాలకు మరింత దగ్గరయ్యి.. మాకు మరో కేసీఆర్.. అని జనం అనుకునేలా తీర్చిదిద్దాలనుకున్నాడాయన. కానీ ఆయన అనుకున్నదొక్కటి.

జరుగుతున్నదొక్కటి. అసెంబ్లీకి పోవాలని కేసీఆర్‌కు లేదు. ఇవాళ జరిగిన బీఆరెస్ ఆందోళన చూస్తే.. కేటీఆర్‌కు కూడా అసెంబ్లీ లో కూర్చుని.. ఓపిగ్గా కాంగ్రెస్ సభ్యులు చెప్పే మాటలు వినాలని లేదు. అందుకే తొలిరోజే దండయాత్ర మొదలు పెట్టాడు. నిజానికి ఇలా బ్లాక్ టీషర్టులు, దానిపై రాతలతో వెళ్లాల్సిన పని లేదు. ఆల్రెడీ వెయ్యి రోజుల పాలనపై బీఆరెస్ కార్యాచరణ తీసుకున్నది. ఇదీ తిరగబడింది. మా పాలనపైనే విమర్శలా? అయితే వెయ్యి రోజుల్లో ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు కదా కేసీఆర్.. ఆయన రాజీనామా చేయాలి.. ఇంట్లో ఉండి జీతభత్యాలు ఎందుకు తీసుకుంటుండు? అని సీఎం రేవంత్ ఎదురుదాడికి దిగడంతో పోటాపోటీ నిరసనలు మొదలయ్యాయి. జనానికి మైండ్ బ్లాక్ అయిపోయింది. ఎవరేం చేస్తున్నారో తెలియదు. ఈ ఇరు పార్టీల కార్యాచరణతో జనాలకు ఏం లాభం ఒనగూరుతుందో అర్థం కాక తలలు గోక్కున్నారు. ఇప్పుడు అసెంబ్లీ సెషన్స్‌లో మళ్లీ కేటీఆర్ తనదైన డైరెక్షన్‌ను అమలు చేశాడు. బ్లాక్ టీ షర్టులైతే ఓకే అంటుండే.. కానీ రాతలపైనే అభ్యంతరాలు చెప్పారు స్పీకర్. ఈ విషయాన్ని పోలీసాఫీసర్ కూడా క్లారిటీ ఇచ్చారు. ఇక హరీశ్ అంగీ ఇప్పి బనీను ప్రదర్శన చేయడం ఓవరే అయ్యిం ది. దీన్ని బట్టి ఇది పక్కా హంగామా ప్రోగ్రాం గానే చూశారు జనం. మాజీ మహిళా మంత్రుల పట్ల పోలీసులు ప్రవర్తన బాగాలేదు..అనే అంశాన్ని హైలెట్ చేసుకుందామనుకున్నారు. నిజంగానే అక్కడ తోపులాట జరిగింది. వారు ఇబ్బంది కూడా పడ్డారు. కానీ మధ్యలో ఎమ్మెల్సీ తాతా మధు మితిమీరిన ఓవర్ యాక్షన్‌తో పాటు సోయితప్పి మాట్లాడిన బూతు డైలాగు .. నేరుగా స్పీకర్‌కే తాకింది. మొత్తం బూమరాంగ్ అయ్యింది. అప్పటి దాకా అనుకున్నది అనుకున్నట్టే జరుగుతున్నది. మధ్యలో సీన్‌లోకి ఎక్కడ్నుంచి వచ్చాడో.. తాతా... మొత్తం చెడగొట్టేశాడు. అది ఏకంగా కేసీఆర్‌కే తాకింది. దళిత స్పీకర్ పట్ల ఇంతలా అవమానకర రీతిలో బూతులకు దిగిన వైనానికి క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేయడంతో అసలుకే ఎసరు తెచ్చిపెట్టింది. ఇటు బీఆరెఎస్ నేతలు... మహిళా నేతలని కూడా చూడకుండా అసభ్యం గా పోలీసులు ప్రవర్తించారని, వెంటనే సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో కేసీఆర్ మరీ ఇబ్బంది పడినట్టే ఉంది. ఎందుకంటే.. ఆయన కోరుకునే నిరసనలు, ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలనుకున్నవి ఇలాంటివైతే కచ్చితంగా కావనే అనుకుంటున్నారు. ఇదంతా కేటీఆర్ నిర్దేశకత్వంలో కొనసాగింపబడిన కార్యక్రమం. కానీ అది ఇలా బోల్తా కొట్టి.. బీఆరెస్ దళిత వ్యతిరేక పార్టీ అనే ముద్రను వేసుకున్నది.

## జోగులాంబ గద్వాల్లో భూ బకాసురుల పంజా

సర్వే నెంబర్ 458 లో ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు పథకం ప్రకారం నకిలీ పట్టాలు, రికార్డులను సృష్టించారు. తమకు ఆ స్థలంపై హక్కులు ఉన్నాయంటూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ, అమాయక ప్రజలకు వాటిని అంటగట్టేందుకు లేదా నేరుగా స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నకిలీ పట్టాల వ్యవహారంపై స్థానికులు, బాధితులు తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలో ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 458 పరిధిలో ఎలాంటి పట్టాలు జారీ చేయలేదని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు సర్కారు ముద్రలు, ఫోర్జరీ సంతకాలతో తయారు చేసిన పత్రాలను చలామణీలోకి తెస్తున్నారని తేలింది. సర్వే నెంబర్ 458 పరిధిలో అక్రమ నిర్మాణాలను, కబ్జా యత్నాలను వెంటనే అడ్డుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఫోర్జరీ సంతకాలు, నకిలీ సీళ్లతో ప్రభుత్వ వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్న ముఠాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నకిలీ పట్టాల వ్యవహారంలో రెవెన్యూ శాఖకు చెందిన సిబ్బంది ఎవరివైనా సహకారం ఉందా అనే కోణంలోనూ సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతు న్నారు. అధికారులు తక్షణమే స్పందించి సర్వే నెం. 458 భూములను కాపాడటంతో పాటు, ప్రజలు ఎవరూ ఈ నకిలీ పట్టాలను నమ్మి కొనుగోలు చేసి మోసపోకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# అసెంబ్లీలో మంత్రి సీతక్క భావోద్వేగ ప్రసంగం..

## కంటతడి పెట్టిన స్పీకర్ గడ్డం ప్రసాద్..

## దొర అహంకారం..

తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఆడబిడ్డలగా మంచిగా మీరు మమ్మల్ని చూసుకుంటారని మంత్రి సీతక్క అన్నారు. లేని తల్లి గురించి అవమానకరంగా మాట్లాడిన తాత మధును వెంటనే సస్పెండ్ చెయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఈ విషయంపై కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు సభ్యత్వం తొలగించాలని అన్నారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు. తాతా మదు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. లేని తల్లిని గుర్తుచేస్తూ అవమానకరంగా మాట్లాడంతో సీతక్క మాట్లాడుతుండగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమోషనల్ అయ్యారు. స్పీకర్ చైర్‌ని స్పీకర్ గౌరవ మర్యాదలకు భంగం కలిగించేవిధంగా తాతా మధు మాట్లాడటం దారుణం అని అన్నారు. లేని తల్లిని గుర్తుచేసి స్పీకర్ ని బాదపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. స్పీకర్ పై అత్యంత అవమానకరంగా మాట్లాడటం దారునం అని సీతక్క ఎమోషనల్ అయ్యారు. రాష్ట్రంలో బ్యాడ్ లాంగ్వేజ్‌కి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ ఆయన బీఆర్ఎస్ పార్టీ అని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ ముసుగులో అనేక తప్పుడు కూతలు కూసిన చరిత్ర కేసీఆర్ ది అని మంత్రి సీతక్క అన్నారు. దళితులంటే వారికి నచ్చదని అందుకే స్పీకర్ గా ఉన్న మిమ్మల్ని చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. దళితులంటే వారికి లెక్కలేదు కాబట్టే దొర అహంకారం దురహంకారం మీపై చూపిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. స్పీకర్ ని తిట్టిన వీడియోస్ అన్నీ తీయించి భాద్యులపై చర్యలు తీసుకోవాలని సీతక్క డిమాండ్ చేశారు. మహిళలపట్ల మీరు గౌరవంగా మాట్లాడే విధానం మాకు తెలుసని అలాంటి మిమ్మల్ని దుర్భాషలాడటం దారునం అని అన్నారు. గతంలో జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ పై దారుణంగా మాట్లాడారని గుర్తు చేశారు.

# జన్ ధన్ బ్యాంకు ఖాతాలు. వెలుగులోకి కొత్త విషయాలు, సమాచారం హక్కు చట్టం ద్వారా.

జన్ ధన్ బ్యాంకు ఖాతాల గురించి కొత్త వార్తల వెలుగులోకి వచ్చింది. ఆనాడు ఎంతో ఘనంగా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ, ఇప్పుడు ఆయా ఖాతాలు 25 శాతం పని చేయలేదని తేలిపోయింది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థికశాఖ సమాధానం ఇచ్చింది. ఇంకా ఏం చెప్పిందంటే.. ప్రధాని నరేంద్రమోదీ తొలినాళ్లలో ప్రారంభించిన పథకాల్లో జనధన్ బ్యాంకు ఖాతాలు. గతేడాది ఈ ఖాతాల గురించి ఎంతో ఘనంగా చెప్పుకుంది కేంద్రం. మొత్తం 59 కోట్లకు పైగా ఖాతాలున్నట్లు తెలిపింది. దీంతో సమాచారం చట్టం ద్వారా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరుపేదలకు ఆర్థిక సేవలు అందించేందుకు ప్రారంభించిన జన్‌ధన్ ఖాతాలు నాలుగోవంతు నిర్వహణకు దూరంగా ఉన్నట్లు తెలిపింది. ఈ ఖాతాలో తప్పని సరిగా నగదు నిల్వ చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులు నేరుగా అర్హులకు బదిలీ చేసేందుకు మాత్రమే ఈ ఖాతాలను ఉపయోగిస్తుంది ప్రభుత్వం. ఈ ఖాతాలు ఎలా ఉపయోగపడుతున్నాయన్న దానిపై సమాచార హక్కు చట్టం–ఆర్‌టీఐ కింద చంద్రశేఖర్ గౌర్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థికశాఖ– ఆర్థిక సేవల విభాగం ఈ విధంగా రిప్లై ఇచ్చింది. 2026 ఆగస్టు 12 నాటికి పీఎంజేడీవై కింద 59.03 కోట్ల ఖాతాలున్నాయి. అందులో నగదు నిల్వలు రూ.3.15 లక్షల కోట్లకు పైగా ఉంది. మరో 5.72 కోట్ల ఖాతాల్లో ఎలాంటి బ్యాలెన్స్ లేదు. అంటే 15.36 కోట్ల ఖాతాలను ఆయా వినియోగదారులు నిర్వహించడం లేదు. అది మొత్తంలో సుమారు 26 శాతానికి సమానం. 32.89 కోట్లు మహిళల పేరిట ఖాతాలున్నాయి. 26.14 కోట్ల ఖాతాలు పురుషులకు చెందినవి కాగా, మిగతావి ట్రాన్స్‌జెండర్స్ వారు ఉన్నారు. జన్‌ధన్ ఖాతాల్లో అగ్రభాగం ఉత్తరప్రదేశ్. అక్కడ 10.51 కోట్ల ఖాతాలతో తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత బీహార్–7.01 కోట్లు, పశ్చిమబెంగాల్–5.73 కోట్లు, రాజస్థాన్–3.87 కోట్లు, మహారాష్ట్ర–3.85 కోట్లు ఉన్నాయి. అయితే జీరో బ్యాలెన్స్ ఖాతాలు అత్యధికంగా యూపీలో ఉన్నాయి. తర్వాత బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం, మహారాష్ట్ర ఉన్నాయి. నిర్వహణ లేని ఖాతాలు ఉత్తరప్రదేశ్ 3.23 కోట్లు.ఇదే అధికం కూడా. తర్వాత బీహార్–1.59 కోట్లు, మధ్యప్రదేశ్–1.35 కోట్లు, పశ్చిమ బెంగాల్–1.02 కోట్లు, మహారాష్ట్ర–97.94 లక్షలు ఉన్నాయి.ౣవీజీణ్ని ఆగస్టు 2014లో జాతీయ ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంగా ప్రారంభించారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
మంగళవారం
8 -09-2026




## రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం.

ఆర్మూర్ సెప్టెంబర్ 7 (ప్రజాగళం) దొంకేశ్వర్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు దహనం చేశారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రజలను దర్శించి మాట్లాడుతూ,రేవంత్ రెడ్డి వెయ్యి రోజులలో పాలన రాక్షసయుగంగా మారిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలన పిచ్చి తుగ్లక్ గా మారింది అన్నారు. ఇందిరమ్మ రాజ్యం కాదు ఇది పోలీసుల రాజ్యం అన్నారు. కాల్చడాలు కూల్చడాలు కేసులు పెట్టడాలే తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రాష్ట్ర డిజిపి సిపి ఆనందును బిఆర్ఎస్ పార్టీ పింక్ బుక్కులో ఎక్కించామన్నారు. ఆర్మూర్లో ఒకరు జోకర్ ఒకరు బ్రోకరు దేశం కోసం ధర్మం కోసం అని అంటాడే తప్ప నియోజకవర్గ అభివృద్ధి లేదన్నారు. కెసిఆర్ కాళ్లు మొక్కి డొంకేశ్వర్, ఆలూరు మండల కేంద్రాలను తెచ్చామన్నారు. రాబోయే ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదాన్న గారి విటల్, లంకేశ్వర్ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు నక్కల భూమేష్, నందిపేట్ మండల అధ్యక్షులు మాచర్ల సాగర్, వెల్మల్ రాజన్న కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణి కి 37 ఫిర్యాదులు.

### చట్ట ప్రకారం పరిష్కరించాలని ఆదేశించిన సీపీ సాయి చైతన్య.




నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 7( ప్రజా గళం ) నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామన్నారు.

## ప్రజావాణికి 116 ఫిర్యాదులు.

### అర్జీలను సత్వరమే పరిష్కరించాలి.



నిజామాబాద్, సెప్టెంబర్ 07 ( ప్రజా గళం ) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదిగల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగు తుంది.



### ఎమ్మార్పిఎస్ జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి స్పష్టం.
### ఎమ్మార్పిఎస్,ఎంఎస్పిలను గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకే నూతన కమిటీల నియామకం.
### మాసాయిపేట యాదగిరి వెల్లడి.

ఎడవల్లి,సెప్టెంబర్ 7: (ప్రజా గళం): ఎమ్మార్పీఎస్,మహాజన సోషలిస్ట్ పార్టి(ఎంఎస్పీ)ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ఎడపల్లి మండలంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎడపల్లి మండల కేంద్రంలోని సాటాపూ ర్ గేట్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల స్థాయి నూతన కమిటీల ఎంపి క ప్రక్రియను చేపట్టారు.ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ లసింగ్ గారి భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీల ఎన్నిక ప్రక్రియలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం నాయకులు,కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సంస్థను క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసే కార్యక్రమం కొనసాగు తోందని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి యాదగిరి మాదిగ అన్నారు.ఇందులో భాగంగానే ఎడపల్లి మండలంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.మాదిగల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఒకప్పుడు మాదిగ సామాజిక వర్గానికి సమాజంలో సరైన గుర్తింపు,గౌరవం లేని పరిస్థితులు ఉండేవని అన్నారు. మాదిగల హక్కులను సాధించడంతో పాటు వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎన్నో సంవత్స రాలుగా చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మాదిగల సమస్యలను ప్రభుత్వాలు, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు.మాదిగల హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం,మాదిగల ఐక్యత కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఆయన చూపిన మార్గంలో నూతన కమిటీ సభ్యులు ముందుకు సాగాలని సూచిం చారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకలాపాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ప్రజల్లో సామాజిక,రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.పార్టీ సిద్ధాంతాలు,మంద కృష్ణ మాదిగ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు.ఎమ్మార్పీఎస్ ఎడపల్లి మండల అధ్యక్షులుగా కొండపాక శివకుమార్,ఉపాధ్య క్షులుగా పురిమేటి సురేష్,సాయిలు,ప్రధాన కార్యదర్శి గా గోనె సంజీవ్,అధికార ప్రతినిధిగా పోతనపల్లి ప్రకాష్,తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.అలాగే మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులుగా ఎర్ర అబ్రహం,ఉపాధ్యక్షులుగా కొంద్ర పాండు,పోతన్ పల్లి ప్రశాంత్,ప్రధాన కార్యదర్శిగా జంగం ఎల్లయ్య,అధికార ప్రతినిధిగా బత్తుల బాబుతో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి విచ్చేసిన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి.

### వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.



ఎడపల్లి,సెప్టెంబర్ 7: (ప్రజా గళం): ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టి(ఎంఎస్పీ)ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ఎడపల్లి మండలంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎడపల్లి మండల కేంద్రంలోని సాటాపూ ర్ గేట్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల స్థాయి నూతన కమిటీల ఎంపి క ప్రక్రియను చేపట్టారు.ఎమ్మార్పీఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్చార్జ్ లసింగ్ గారి భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీల ఎన్నిక ప్రక్రియలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం నాయకులు,కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీ లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సంస్థను క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసే కార్యక్రమం కొన సాగు తోందని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి యాదగిరి మాదిగ అన్నారు.ఇందులో భాగంగానే ఎడపల్లి మండలంలో నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.మాదిగల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఒకప్పుడు మాదిగ సామాజిక వర్గానికి సమాజంలో సరైన గుర్తింపు,గౌరవం లేని పరిస్థితులు ఉండేవని అన్నారు. మాదిగల హక్కులను సాధించడంతో పాటు వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలనే లక్ష్యంతో ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎన్నో సంవత్స రాలుగా చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మాదిగల సమస్యలను ప్రభుత్వాలు, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలి పారు. మాదిగల హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం, మాదిగల ఐక్యత కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఆయన చూపిన మార్గంలో నూతన కమిటీ సభ్యులు ముందుకు సాగాలని సూచిం చారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకలాపాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ప్రజల్లో సామాజిక,రాజకీయ చైతన్యం పెంపొందిం చేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.పార్టీ సిద్ధాంతాలు,మంద కృష్ణ మాదిగ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు.ఎమ్మార్పీఎస్ ఎడపల్లి మండల అధ్యక్షులుగా కొండపాక శివకుమార్,ఉపాధ్య క్షులుగా పురిమేటి సురేష్,సాయిలు,ప్రధాన కార్యదర్శి గా గోనె సంజీవ్, అధికార ప్రతినిధిగా పోతనపల్లి ప్రకాష్,తో పాటు ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.అలాగే మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులుగా ఎర్ర అబ్రహం,ఉపాధ్యక్షులుగా కొంద్ర పాండు,పోతన్ పల్లి ప్రశాంత్,ప్రధాన కార్యదర్శిగా జంగం ఎల్లయ్య,అధికార ప్రతినిధిగా బత్తుల బాబుతో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి విచ్చేసిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.

### బిఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ఇంచార్జ్ అయేషా పాతిమా ఆరోపణ.
### బిఆర్ఎస్ పార్టీ నిరసన...ఆర్డీవో కు వినతి పత్రం అందజేత...

బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 7: (ప్రజా గళం) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వ హించారు.పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం,అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవో విజయకుమారికి వినతి పత్రం అందజేశారు.ఈ సంద ర్భంగా బిఆర్ఎస్ ఇంచార్జి ఆయేషా ఫాతిమా మాట్లా డుతూ..తెలంగాణ అభివృద్ధికి మూలస్తంభాలైన వ్యవ స్థలు ధ్వంసమవుతున్నాయని,ప్రజా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద ర్ యాదవ్,నాయకులు సంజీవ్ శ్రీరామ్,నర్సింగ్ రావు, అబ్బన్న,భూమారెడ్డి,వడ్ల సతీష్,కౌన్సిలర్లు గుమ్ముల అశోక్ రెడ్డి,ముషీర్ భాయ్,మోబిన్,అజార్,లక్ష్మి తదిత రులు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

మంగళవారం
8 -09-2026

# బైక్ అదుపు తప్పి లిఫ్ట్ ఇరిగేషన్ ఆపరేటర్ మృతి.



నందిపేట్ సెప్టెంబర్ 7 (ప్రజా గళం) అడవి వంది అడ్డు రావడంతో దానిని తప్పించబోయ్ బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం సమయంలో జరిగింది. మండల పరిధిలోని గంగాసముందర్ గ్రామానికి చెందిన మీర సకాలి ఉస్సన్న (45) అనే వ్యక్తి బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు నందిపేట్ పోలీసులు తెలిపారు. మృతుడు ఉస్సన్న గత 8 నెలలుగా మారంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ వద్ద ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే ఈ నెల 6వ తేదీన ఉదయం తన టీవీఎస్ మోటార్ సైకిల్ (ఏపీ01-ఎజు-1309) పై పంప్ హౌస్‌కు వెళ్లాడు. నిన్న సాయంత్రం 4:00 గంటలకు విధి నిర్వహణ ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, లిఫ్ట్ రోడ్ గుట్ట (కొండ) ప్రాంతంలో ఎదురుగా అడవి పంది అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి మట్టిరోడ్డుపై కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ముఖానికి తీవ్ర గాయాలై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుడు మైస సంతోష్ ఇచ్చిన సమాచారంతో మృతుడి మేనల్లుడు మీర అనిల్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని గుర్తించాడు. అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి.

## మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన.

నిజామాబాద్ సెప్టెంబర్ 7 ( ప్రజాగళం ప్రతినిధి ): జిల్లా కేంద్రంలోని ప్రగతి ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. కాళ్లు చేతుల నొప్పులతో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తికి వైద్యులు సరైన వాద్యం అందించకపోవడంతో మృతి చెందాడు. వ్యక్తి మృతితో తీవ్ర ఆవేదనకు గురైన బంధువులు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు చేపట్టారు. తన తండ్రి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతువి కొడుకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌లో డా. భరత్, వద్ద చికిత్స పొందిన ఐ. సుదర్శన్ విషయంలో అనుమానాస్పద వైద్య నిర్లక్ష్యం, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా 10 ఎంజి మత్తు/సెడేటివ్ ఇంజెక్షన్ ఇవ్వడం, సరైన పర్యవేక్షణ లేకపోవడం, అనంతరం రోగి పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పైకి వెళ్లిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా మృతుడి కొడుకు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడు గ్రామం కు చెందినసుదర్శన్ కు



చేతులు, కాళ్లు సరిగా కదలకపోవడంతో వైద్య చికిత్స కోసం గత నెల 31వ తేదీన సాయంత్రం 5 గంటలకు ప్రగతి హాస్పిటల్, నిజామాబాద్‌లో చేర్పించారు. అక్కడ డా. భరత్ పర్యవేక్షణలో చికిత్స అందించారు. రోగికి సీటిస్కాన్ నిర్వహించగా, స్కాన్ లో సాధారణంగానే ఉందని, రోగిని ఒక రోజు పర్యవేక్షణలో ఉంచుతామని వైద్యులు తెలిపారు. తరువాతి రోజు 31 వ తేదీన మధ్యాహ్నం వరకు, రోగి పరిస్థితి మెరుగుపడినట్లు కనిపించింది. రోగి స్వయంగా తాను కోలుకున్నానని, ఇంటికి వెళ్లాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే, డా. భరత్ రోగి ఇంకా ఒక వారం రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండాలని, అనంతరం జనరల్ వార్డుకు పంపిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. కానీ మా అనుమతి లేకుండానే మోతాదుకు మించి మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో తన తండ్రి చనిపోయాడని దీనిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఆస్పత్రి ఆందోళనతో వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు.

# మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం.

## విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో నందిపేట ఎస్సై వినయ్.



నందిపేట్, సెప్టెంబర్ 7 (ప్రజాగళం) మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నందిపేట ఎస్సై వినయ్ సూచించారు. నందిపేట్ మండల కేంద్రంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నందిపేట్ పోలీసులు, ఈగల్ టీం ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిపేట్ ఎస్సై వినయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నందిపేట్ లోని ప్రైవేట్ స్కూల్స్, గవర్నమెంట్ స్కూల్స్ కు సంబంధించిన 7 వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం సిబ్బంది, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పరాకాష్టకు చేరిన కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలన.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే చీర పట్టి లాగడం సిగ్గుచేటు.: అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల.

నిజామాబాద్, సెప్టెంబర్ 7( మెట్రోన్యూస్ ): తెలంగాణ రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కొనసాగుతున్న నిరసనల్లో భాగంగా సోమవారం బిగాల గణేష్ గుప్త ఆధ్వర్యంలో నగరంలోని పూలాశీ గ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ కు వెళ్లి జిల్లా ఆదన కలెక్టర్ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ,అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిన తీరు, పోలీసుల ద్వారా చేయించిన భౌతిక దాడులను నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీల అమలును కోరుతూ నల్ల టీషర్టులు ధరించి శాంతియుతంగా అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమని



పేర్కొన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగడం కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి, మహిళల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రులు హరీష్ రావు , జగదీష్ రెడ్డి లతో పాటు పలువురు ఎమ్మెల్యేలను కిందపడేసి, తొక్కి, తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు.

మహిళా ప్రజాప్రతినిధిపై జరిగిన దాడికి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిపిన భౌతిక దాడులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పాలన చేతకాకపోతే రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేసి గద్దె దిగాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, నిరంకుశ పాలన సాగిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిర్ప రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ దండు నీతూ కిరణ్, ఠాగూర్ సుజీత్ సింగ్, గాండ్ల లింగం, నవీద్ ఇక్బాల్, పాల్గొన్నారు.

# వృద్ధురాలి చెవులు కోసి చెవికమ్మలు చోరీ.



నిజామాబాద్ క్రైం , సెప్టెంబర్ 7( ప్రజాగళం) : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి చెవులు కోసి చెవి కమ్మలు ఎత్తుకెళ్లిన దుండగుడు. బాధితురాలని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నగరంలోని బంగారు మైసమ్మ కాలనీలో ఓ వృద్ధురాలిపై దుండగుడు దాడి చేశాడు. ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి వృద్ధురాలి చెవులు కోసి బంగారు చెవి కమ్మలను లాక్కెళ్లాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బంగారు మైసమ్మ కాలనీలో అరుంధతి అనే వృద్ధురాలి నివాసం ఉంటుంది. నితిన్? అనే వ్యక్తి ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. చెవి కమ్మలు, రూ.500 ఇవ్వాలని బెదిరించడంతో వృద్ధురాలు చెవి కమ్మలు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆ ఇంట్లో అందుబాటులో ఉన్న కత్తెరతో ఆమె చెవిని కోసి కమ్మలు లాక్కున్నాడు. అనంతరం గడ్డపారతో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో అరుంధతి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని మూడవ టౌన్? పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అండ.

## 60 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ సాయి చైతన్య.

## 200 మంది అభ్యర్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ.

నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 7 (ప్రజాగళం ) :నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ ఆడిటోరియం లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సోమవారం ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ , సబ్-ఇన్స్పెక్టర్ తదితర ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ , సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగుతుందని. హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించబడతాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతుందన్నారు. శిక్షణలో భాగంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. పరీక్షలో ప్రశ్నలను వేగంగా , కచ్చితంగా పరిష్కరించే విధానం , సమయపాలన , పరీక్షా విధానం , ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో నిపుణులచే మార్గదర్శకత్వం



అందించనున్నారు. అలాగే అభ్యర్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా శిక్షణ అందించడంతో పాటు , నిరంతర సాధన ద్వారా పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించనున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. పోలీస్ ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ 60 రోజుల శిక్షణను ఎంతో విలువైన అవకాశంగా భావించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, అధ్యాపకులు సూచించే విధంగా కష్టపడి చదివి, నిరంతరం సాధన చేయాలని కమిషనర్ సూచించారు. కేవలం శిక్షణకు హాజరవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ, తమ బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేలా కృషి చేయాలని అన్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధించవచ్చని అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ , సి.టి.సి ఎ. సి. పి లు ప్రకాష్ యాదవ్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీనివాస్ , రాజశేఖర్ , జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , వన్ టౌన్ ఎస్హెచ్ఓ రఘుపతి, నగర సిఐ శ్రీనివాస్ రాజ్ , నిజామాబాద్ రూరల్ సిఐ ,శ్రీనివాస్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీలత , సిసిఆర్బి ఎస్ఐ వరప్రసాద్ రెడ్డి , త్రీ టౌన్ఎస్ఐ హరిబాబు , టౌన్ 6 ఎస్సై సందీప్ , టౌన్ 5ఎస్ఐ సునీల్ , సిసిఆర్బి ఎస్ఐ వెంకట్రావు, ఫాకల్టీ , విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com